క్లుప్తంగా

త్వరలో రోడ్డు పనులు ప్రారంభం..

టేకులపల్లి: దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సింగరేణి, గ్రామ పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని దాసుతండా, రేగులతండా ప్రజలు గురువారం రోడ్డుపై నిరసన తెలియజేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆ రోడ్డును పరిశీలించారు. రోడ్డు నిర్మాణం సగంలో నిలిపివేయడం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నామని, కంకర తేలి ఉండటంతో దుమ్ము వస్తోందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రెండు వారాల్లో పనులు ప్రారంభం అవుతాయని హామీ ఇచ్చారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆరోగ్యశ్రీ సేవలను అందిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లిక్కి బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం ఉద్యోగులు చేపట్టిన ధర్నా కార్యక్రమానికి ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీఐటీయూ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాళంగి హరికృష్ణ, చప్పిడి శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల సందర్శన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ 11వ వార్డులోని రామవరం నేతాజీ అమ్మ ఆదర్శ పాఠశాలను శుక్రవారం నోడల్ అధికారి డాక్టర్ ప్రభుదయాళ్ ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని సివిల్ పనుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, సామర్థ్యాలను పరిశీలించారు. మాట్లాడుతూ.. విద్యార్థుల తలరాతను మార్చేది విద్యేనని, కాబట్టి ఉపాధ్యాయులు విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలన్నారు.

నిధులివ్వండి..

ఇల్లెందు: పట్టణంలోని శ్రీ హరిహర క్షేత్రంలో అభివృద్ధికి నిధులు కేటాయించాలని ధర్మకర్తల మండలి వేడుకుంది. శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. చైర్మన్ గందె సదానందం మాట్లాడుతూ.. ఇక్కడ ఏటా మూడువేల మంది స్వాములు మాల ధరిస్తారని, మూడు నెలల పాటు విశేషంగా పూజలు జరుగుతాయని తెలిపారు. తాగునీరు, మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని, రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. కండె రమేష్, చంద్రశేఖర్, శివరాత్రి ఎల్లయ్య ఉన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: పోషణ్ అభియాన్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అనంతారం అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులకు సామూహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడుతూ.. తల్లీబిడ్డలు పోషకాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. గర్భిణులకు పుట్టబోయేచే బిడ్డ ఆరోగ్యంతోపాటు, పెరుగుదల ఉంటుందన్నారు.

ఏజెన్సీ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా క్రాంతికుమార్

పాల్వంచ: ఏజెన్సీ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కార్యదర్శిగా పాల్వంచ కరకవాగుకు చెందిన భట్టు క్రాంతికుమార్ నియామకమయ్యారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షుడు లాల్‌సింగ్ నాయక్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందుకున్నారు.

కూరగాయల సాగుపై ఆసక్తి

- ఏడాది విరామం తర్వాత రైతుల్లో కదలిక
- బీర, టమాట సాగు ప్రారంభించిన అన్నదాతలు
- స్థానిక వినియోగదారులకు ఊరట



కొమరారంలో సాగవుతున్న బీరతోట

ఇల్లెందురూరల్: ఆ పల్లెలు కూరగాయల సాగుకు చిరునామా. రెండు దశాబ్దాలుగా సీజన్‌వారీగా కూరగాయల సాగు చేస్తూ ఇల్లెందుతోపాటు కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్, విజయవాడ మార్కెట్‌లకు కూడా కూరగాయలను ఎగుమతి చేసిన ఘనత ఆ గ్రామాల సొంతం. కానీ నాలుగేళ్ల క్రితం ఆ ఊళ్లలో రైతులు కూరగాయల సాగుకు స్వస్తి పలికారు. కానీ ఈ ఏడాది వానాకాలం నుంచి అతివృష్టి, అనావృష్టి కారణంగా పత్తి, మిర్చి పంటలు దెబ్బతినడంతో చేసేది లేక మళ్లీ తమకు అనుభవం ఉన్న కూరగాయల సాగు దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు.

రెండు దశాబ్దాలకు పైగా..

సాధారణ పంటల సాగుతో వరుస నష్టాలను చవిచూసిన రైతులు ప్రత్యామ్నాయంగా కూరగాయల సాగుపై దృష్టి సారించారు. ఒక్కొక్కరుగా కూరగాయల సాగు చేస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు. దీనికితోడు నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం రైతులకు కలిసొచ్చింది. ఆ తరువాత వచ్చిన పాలకులు రాయితీ సౌకర్యాలను పెంచడంతో కూరగాయల విస్తీర్ణం క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఐటీడీఏ ఒక అడుగు ముందుకేసి రైతులకు విత్తనాలతోపాటు పందిరి, మార్కెట్ వరకు కూరగాయల రవాణాకు అవసరమైన వాహనాలను కూడా సబ్సిడీ ధరలలో అందించింది. సౌకర్యాలను అందిపుచ్చుకున్న రైతులు క్రమంగా సాగు విస్తీర్ణంను పెంచుకుంటూ వచ్చారు. పదుల ఎకరాల స్థాయి నుంచి దశాబ్దకాలంలో వందల ఎకరాలకు చేరుకుంది. స్థానిక అవసరాలకు కూరగాయలను అందిస్తూ ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది. ఇలా సుమారు రెండు దశాబ్దాలకుపైగా కూరగాయలు సాగు చేసిన రైతులు ఒక ఎకరం విస్తీర్ణంలో రూ.2లక్షల వరకు లాభాలు ఆర్జించారు.

200 ఎకరాల్లో ప్రారంభమైన సాగు..

సుమారు నాలుగేళ్లుగా కూరగాయల తోటలకు ఫంగస్ సోకడం ప్రారంభమైంది. దీంతో పెట్టుబడి కూడా చేతికందక కూరగాయల రైతులు భారీగా నష్టాలను చవిచూశారు. దీంతో ఈ ఏడాది వేసవి పంటగా భావించే కాకర సాగుకు రైతులు సామూహికంగా స్వస్తి పలికారు. ఆ తరువాత కూడా కూరగాయల సాగు జోలికి పోకుండా పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటల సాగుపై మక్కువ చూపారు. కానీ వారి దురదృష్టమో.. ప్రకృతి ప్రకోపమో.. తెలియదు కానీ.. వేసిన పంటలన్నీ నీటిపాలయ్యాయి. పంటలన్నీ ఛిద్రం కావడంతో వాటిని తొలగించి తమకు అనుభవం ఉన్న కూరగాయల సాగు దిశగా అడుగులు వేశారు. మండలంలోని పోలారం, కొమరారం, పోచారంతండా, అమర్‌సింగ్‌తండా, పందిరిమంగ్యా తండా గ్రామాలలో వంద ఎకరాల్లో బీర, టమాట, బెండ, వంకాయ పంటలను సాగు చేస్తున్నారు. అంతేకాకుండా కాలీఫ్లవర్, క్యాబేజీ పంటల సాగుకు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు.

విక్రయ సౌకర్యం కల్పిస్తే..

చేనులో కోసిన కూరగాయలను రైతు నేరుగా మార్కెట్‌కు తీసుకెళ్తే దళారులు రంగప్రవేశం చేసి రైతును నష్టాల ఊబిలోకి దించుతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రైతు బజార్ ఏర్పాటు చేస్తామని ఒక నేత.. నిల్వ చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేసేందుకు ఏసీ గోదాము నిర్మిస్తామని మరో నేత హామీలు గుప్పించారే తప్ప, ఆచరణకు నోచుకోలేదు. ఏసీ గోదాములు నిర్మించకున్నా రైతు తాను పండించిన పంటను తానే విక్రయించుకునే సౌకర్యం కల్పిస్తే ఇల్లెందు ఏజెన్సీలో కూరగాయల సాగు పూర్వ స్థితికి చేరుకుంటుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

వినియోగదారులకు ఊరట..

అతివృష్టి, అనావృష్టి కారణంగా కూరగాయల ధరలు ఆకాన్నంటిన వేళ కూడా స్థానికంగా కూరగాయలు పండటంతో కొన్నింటి ధరలైనా కొంత అదుపులో ఉండేవి. కానీ ప్రస్తుతే ఏడాది స్థానికంగా కూరగాయల సాగుకు రైతులు స్వస్తిపలకడానికి తోడు ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలతో కూరగాయల ధరలు కొండెక్కాయి. దీంతో కూరగాయలు కొనా లంటేనే కళ్లు బైర్లు కమ్మే పరిస్థితి నెలకొంది. ఇటువంటి పరిస్థితిలో స్థానిక రైతులు మళ్లీ కూరగాయల సాగును ప్రారంభించడం వినియోగదారులకు ఊరట.

రైతు బజార్లను ఏర్పాటు చేయాలి...



వేసవిలో కాకర, వర్షాల సమయంలో బీర, చలికాలంలో టమాట, ఇతర పంటలు పండిస్తున్నాం. ఇంత శ్రమించినా పెట్టుబడి రావడం లేదు. వ్యాపారుల దోపిడీ నుంచి రక్షించేందుకు రైతు బజార్ ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– మంచె రమేష్, రైతు, కొమరారం

పోయిన చోటే వెదుక్కోవాలని..



నాలుగేళ్లు నష్టాలను చవిచూశాం. ఈ ఏడాది కూరగాయల సాగుకు స్వస్తి పలికి ఇతర పంటలపై దృష్టి సారించాం. కానీ ఫలితం దక్కలేదు. పోయిన చోటే వెదుక్కోవాలన్న నానుడిని గుర్తు చేసుకొని మళ్లీ కూరగాయల సాగును ప్రారంభించాం.

– వాంకుడోత్ లింగా, రైతు, అమర్‌సింగ్‌తండా

స్పందించకపోతే 27 నుంచి నిరసన



డీఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఈఓలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓ) శుక్రవారం కలెక్టర్ పాటిల్, జిల్లా వ్యవసాయాధికారి వి.బాబురావులకు వినతిపత్రాలు అందజేశారు. మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో తాము పని ఒత్తిడికి గురవుతున్నామని ఏడేళ్లుగా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పరిష్కారం కావడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సరాసరి ఐదు నుంచి ఆరు రెవెన్యూ గ్రామాలకు అంటే సుమారుగా 8,500 ఎకరాల సాగుభూమికి ఒక ఏఈఓ మాత్రమే ఉన్నట్లు తెలిపారు. తలకు మించిన పని భారాన్ని మోస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక గ్రామ వ్యవసాయ సహాయకులను నియమించాలని కోరారు. ఏఈఓ సంఘాలతో చర్చించి ఈనెల 26లోగా స్పష్టమైన ప్రకటన రాకపోతే 27 నుంచి నిరసన కార్యక్రమాలను చేపడతామని చెప్పారు.

బీసీలకు రిజర్వేషన్ పెంచండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీసీల జనాభా దామాషా ప్రకారం 42 శాతం రిజర్వేషన్ చట్టం చేయాలని, హైకోర్టు తీర్పును అనుసరించి మూడు నెలల్లో కులగణన చేయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కురిమెళ్ల శంకర్, సత్యనారాయణ, భూపతి శ్రీనివాసరావు, అంకినీడు ప్రసాద్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న మూడు నూతన చట్టాలు విద్యార్థులకు ఎంతో అవసరం అని డీఎస్పీ చంద్రభాను తెలిపారు. శుక్రవారం ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. జూన్ 1 నుంచి ఈ చట్టాలు అమలులోకి వచ్చాయని, తప్పు చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు బత్తుల సత్యనారాయణచ తాటిపాములు సురేష్, శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి..

పాల్వంచరూరల్: గ్రామ పంచాయతీలకు నిధులు లేని కారణంగా అభివృద్ధి కుంటుపడుతోందని ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని సేవాలాల్ సేన యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు శ్రీను డిమాండ్ చేశారు. తోగ్గూడెంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. అంగోతు నగేష్, గుగులోతు భద్రు, భూక్యా రాములు, జర్పుల బాలకృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ధర్నా

సూపర్‌బజార్(కొత్తగూడెం): అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీ టీచర్లకు జీతం రూ.13,650 చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూటియు అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, ఐసీడీఎస్ డీడబ్ల్యూఓ విజేతకు వినతిపత్రం అందజేశారు. బ్రహ్మచారి, జి.పద్మ పాల్గొన్నారు.

కనికరం చూపండి..

టేకులపల్లి: ఏకలవ్య మోడల్ స్కూల్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న తనను అన్యాయంగా తొలగించారని బాధిత హిందీ టీచర్, సింగరేణి మండలం భాగ్యనగర్ తండాకు చెందిన వాంకుడోత్ ప్రేమ్‌లాల్ ఆవేదన వ్యక్తం చేసాడు. శుక్రవారం టేకులపల్లి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. తనకు అన్యాయం జరిగిందని ఐటీడీఏ పీఓని స్వయంగా కలిసి వేడుకున్నా కనికరించలేదని వాపోయాడు. తనను ఉద్యోగం నుంచి తొలగించడం వల్ల భార్య, ఇద్దరు పిల్లల పోషణ భారంగా మారుతుందని కన్నీటి పర్యంతమయ్యాడు. మంత్రులు, కలెక్టర్, పీఓ, అధికారులు స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

సూపరింటెండెంట్‌కు సన్మానం

ఇల్లెందురూరల్: ఎంపీడీఓగా పదోన్నతి పొందిన ఇల్లెందు మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్‌ను అధికారులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల బదిలీపై గుండాల మండలం నుంచి ఇల్లెందుకు వచ్చిన ఆయనకు పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓగా అశ్వారావుపేట మండలానికి వెళ్లారు.

అప్రమత్తంగా ఉండాలి

బూర్గంపాడు: కిన్నెరసాని ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 407.00 అడుగులకు గాను ప్రస్తుతం 406.50 అడుగులు ఉందని, కొద్దిపాటి వర్షం కురిసిన డ్యామ్ గేట్లు ఎత్తే అవకాశాలున్నాయని తహసీల్దార్ ముజాహిద్ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో మూడు రోజుల పాటు వర్ష సూచనలు ఉన్నందున ఏ క్షణమైనా ప్రాజెక్ట్ గేట్లు ఎత్తుతారని, పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కిన్నెరసాని పరివాహక ప్రాంతాల రైతులు విద్యుత్ మోటార్లు, వ్యవసాయ పనిముట్లను ముందస్తుగా జాగ్రత్త చేసుకోవాలని సూచించారు.

ఆర్థిక సాయానికి దరఖాస్తులు

పాల్వంచ: పేద ఆర్యవైశ్య విద్య, వివాహాలకు సాయం అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శ్రీ వాసవీ ఆర్యవైశ్య ట్రస్ట్ అధ్యక్షుడు దేవిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేద ఆర్యవైశ్యులను ఆదుకోవడమే తమ ధ్యేయం అన్నారు. కొత్తగూడెం జిల్లా విద్యార్థులు సెప్టెంబర్ 30లోపు దరఖాస్తులను తమ ట్రస్ట్‌కు అందించాలని, వివరాలకు 9848183504, 9848723131 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

జూలూరుపాడు: పడమటనర్సాపురం, పాపకొల్లు (అన్నారుపాడు), జూలూరుపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇల్లెందురూరల్: లచ్చగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లచ్చగూడెం, మామిడిగుండాల, చల్లసముద్రం గ్రామపంచాయతీ ఆంజనేయపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోస్టులు మంజూరు చేయండి..

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని హిస్టరీ, సివిక్స్ పోస్టులను విడివిడిగా మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు.

పాలకులు విఫలం..

పాల్వంచ: పాలకులకు ముందు చూపులేకపోవడంతో నిత్యావసర ధరలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీరశెట్టి పద్మజ అన్నారు. శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

పల్లెలను స్వచ్ఛతకు నిలయంగా తీర్చిదిద్దాలి

ఇల్లెందు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. శుక్రవారం పట్టణంలోని 4వ వార్డులో చేపట్టిన ఈ కార్యక్రమంలో వార్డులో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ యాదగిరి, మేనేజర్ అంకుషావలీ, కౌన్సిలర్ సయ్యద్ ఆజమ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: పల్లెలను స్వచ్ఛతకు నిలయంగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండలంలోని పలు గ్రామాలలో గ్రామపంచాయతీ, ఆరోగ్య సిబ్బంది గ్రామాలలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు.



ఇల్లెందురూరల్: మామిడిగుండాలలో నిల్వ నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

వీధులలో చెత్త చెదారం తొలగించడంతోపాటు మురుగుకాల్వలను శుభ్రం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటిని తొలగించి దోమల నివారణకు జాగ్రత్తలు సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన..

జూలూరుపాడు: జూలూరుపాడు ఎస్సీ కాలనీలో శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం లోపంతో ప్రబలే వ్యాధులను పాటల ద్వారా అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఇంటి చుట్టు పక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు రాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాకారుల బృందం లీడర్ కాంపల్లి బాలు, కృపానందం, ముసా, నరేంద్ర, కుమారి, నీలా, కౌసర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న డాక్టర్ చిన్నప్పయ్య

ఇల్లెందురూరల్: పర్యావరణ పరిరక్షణను ప్రతీఒక్కరు బాధ్యతగా భావించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిన్నప్పయ్య అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. మాట్లాడుతూ.. నేటి ప్రపంచమంతా శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధిని కొనసాగిస్తోందని, ఈక్రమంలో పరిశ్రమలు వెదజల్లే విషపూరిత వాయువులు పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నట్లు చెప్పారు. ఆధునిక పోకడలను సంతరించుకున్న మానవులు పర్యావరణ విషయంలో అశ్రద్ధ చేయడం వల్ల మానవ మనుగడ అంతరించిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. వాతావరణంలో ఓజోన్ పొర దెబ్బతినడానికి, ప్రకృతి విపత్తులు సంభవించడానికి మానవుని దినచర్యలలో నిత్యం ఉపయోగించే వివిధ రకాల వస్తువుల నుంచి వెలువడే రసాయనాలే కారణమని పేర్కొన్నారు. వాటిని తగిన మోతాదులో ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణవేణి, అధ్యాపకులు శేఖర్, ప్రభాకర్‌రావు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని 'క్వారీలు'



మాట్లాడుతున్న శివనాయక్

పాల్వంచ: మండలంలోని తోగ్గూడెం ఏజెన్సీలో నిబంధనలకు విరుద్ధంగా క్వారీలను నిర్వహిస్తున్నారని సేవాలాల్ సేన, యువసేన జిల్లా అధ్యక్షుడు మాలోతు శివనాయక్, బానోతు భరత్ అన్నారు. శుక్రవారం స్థానిక కేటీపీఎస్ తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ భవన్‌లో సేవాలాల్ సేన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏజెన్సీలో ఇటీవల గిరిజనేతరుల పెత్తనం పెరిగిందన్నారు. తోగ్గూడెంలో గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతున్నారని వాపోయారు. అనుమతి లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్నారని, తారు ప్లాంట్ల ఏర్పాటుతో ఇళ్లు ధ్వంసం అవుతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

22, 23 తేదీల్లో డ్రైవర్ల యూనియన్ మహాసభ

టేకులపల్లి: ఈనెల 22, 23 తేదీల్లో కొత్తగూడెంలోని బస్టాండ్ వద్ద క్లబ్‌లో జరగనున్న ఆటో క్యాబ్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు గుగులోత్ రాంచందర్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం పథకం ప్రవేశపెట్టడంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి దుర్భరంగా మారిందని వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలని, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 2019 మోటార్ వాహన చట్టాన్ని రద్దు చేయాలని, ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు, 60 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్స్ ఇవ్వాలని విన్నవించారు. ఈ మహాసభకు ఆటో, క్యాబ్ కార్మికులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.

క్రీడా పోటీలు ప్రారంభం



కబడ్డీ జట్టుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రాంగణంలో శుక్రవారం మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభమయ్యాయి. 18 ప్రభుత్వ పాఠశాలల నుంచి 580 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. కానీ ఈ క్రీడా పోటీలకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని, ఎంఈఓ పర్యవేక్షణ లేకపోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శించారు. ఒకవైపు మధ్యాహ్నం భోజనాల కోసం క్రీడా పాఠశాల విద్యార్థులు, మరోవైపు ఆటల్లో పాల్గొనే విద్యార్థులు వ్యాన్‌లో ఎక్కించడంతో డ్యామ్‌సైడ్ గిరిజన గురుకుల ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు పాట్లు పడ్డారు.

జోనల్ స్థాయికి 72మంది ఎంపిక..

మండల స్థాయి క్రీడాపోటీలు సాయంత్రం ముగిశాయి. ఈనెల 23, 24 తేదీల్లో బూర్గంపాడు మండల కేంద్రంలో జరగనున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలకు 72మందిని ఎంపిక చేశారు.

వర్షంతో నిలిచిన ఆటలపోటీలు..

ఇల్లెందు: జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో రెండో రోజు మండల స్థాయి పాఠశాలల క్రీడలకు వర్షంతో ఆటంకం ఏర్పడింది. శుక్రవారం ఆటలపోటీలు పూర్తి చేసి బహుమతులు పంపిణీ చేయాల్సి ఉండగా వాయిదా పడింది. ఇదిలా ఉండగా ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలకు గైర్హాజరయ్యారు.

ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా శ్రమించాలి



ఇల్లెందురూరల్: చెక్కు అందజేస్తున్న పూర్ణచంద్రప్రధాన్

ఇల్లెందురూరల్: శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టి ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా శ్రమించాలని ఇల్లెందు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పూర్ణచంద్ర ప్రధాన్ సూచించారు. మండంలంలోని యువజన శిక్షణ కేంద్రంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా శిక్షణ పొందిన వారికి శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని శుక్రవారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విశ్వకర్మలకు పీఎం విశ్వకర్మ యోజన పథకం వరం లాంటిదని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అంశంపై పొందిన శిక్షణ ద్వారా అందిపుచ్చుకున్న నైపుణ్యాన్ని వృద్ధి చేసుకుంటూ మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి రూ.లక్ష చెక్కు, ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ సురేష్, న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరాజు, శిక్షన కేంద్రం సమన్వయకర్త రాంనారాయణ, శిక్షకులు రవీందర్, కృష్ణవేణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

టేకులపల్లి: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 రకాల వృత్తుల వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 1 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పాల్వంచరూరల్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి కులమతాలకు అతీతంగా వృత్తి పనులు చేసుకునే వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి సూచించారు. శుక్రవారం కేశవాపురం గ్రామంలో స్థానికులకు పథకంపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన 18 రకాల వృత్తిపనుల వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. లబ్ధిదారులకు శిక్షణ కాలంలో రోజుకు రూ.500, రూ.15వేల విలువైన టూల్ కిట్, రూ.1లక్ష రుణం అందజేయడం జరుగుతుందని తెలిపారు.

విశ్వకర్మ ఆధునిక ఉపకరణాలతో నైపుణ్యాభివృద్ధి..

కొత్తగూడెంటౌన్: పీఎం విశ్వకర్మ యోజన మొదటి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా శిక్షణ పొందిన వారికి పీఎం విశ్వకర్మ యోజన జిల్లా స్టీరింగ్ కమిటీ మెంబర్ ఆకుల నాగేశ్వరావు, ఎస్‌బీఐ మేనేజర్ శ్రీకాంత్‌లు పట్టణంలోని నాక్ ట్రైనింగ్ సెంటర్‌లో శుక్రవారం లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. మాట్లాడుతూ.. విశ్వకర్మ ఆధునిక ఉపకరణాలతో నైపుణ్యాభివృద్ధికి మార్గం అన్నారు.

'జులూస్ ఎ మహమ్మదీ' శాంతి ర్యాలీ



మాట్లాడుతున్న మత పెద్దలు

కొత్తగూడెంటౌన్: మహ్మద్ ప్రవక్త జన్మదినంను పురస్కరించుకుని రామవరంలో అహలె సున్నత్‌వల్ జమాత్ ఆధ్వర్యంలో శుక్రవారం జులూస్ ఎ మహమ్మదీ శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదానాన్ని సీఐ రమేష్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ప్రారంభించారు.

పాల్వంచ: ఈనెల 16వ తేదీన నిర్వహించాల్సిన మొహమ్మద్ మహా ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని నిర్వహించాల్సిర జులూస్ ఎ మహమ్మదీ కార్యక్రమాన్ని అదేరోజు వినాయక నిమజ్జనం ఉండటం వల్ల వాయిదా వేశారు. ఈ మేరకు శుక్రవారం పాల్వంచలో జులూస్ ఎ మహమ్మదీ శాంతి ర్యాలీ నిర్వహించారు. మతపెద్దలు మాట్లాడుతూ.. ఇస్లాం మతం సారాంశమే సర్వమానవాళి ఐకమత్యం చాటడం అన్నారు. దానిని ఆచరణలో చూపిన మహనీయుడు మహమ్మద్ ప్రవక్త అని చెప్పారు.